క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింది తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

ఉదయం 12 నుంచి 2 గంటల వరకు...
పెంటయ్య బ్యాండ్, బీబీకా ఆలావ, కమేలేషా దర్గా, జబ్బార్ హోటల్ పరిసర ప్రాంతాలు

మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు...
సిటీ పల్స్, ధర్మావంత్ కాలేజ్, గంగా నగర్ నాలా, యాకుత్ మహల్ థియేటర్, సిల్కీ ఐస్‌క్రీం పరిసర ప్రాంతాలు

మ.2 నుంచి సా.4 గంటల వరకు...
గౌస్ కేఫ్, యూనిక్ స్కూల్, ఇమ్లిబన్, ముర్తుజానగర్ చమన్, సాదత్‌నగర్, చంద్రానగర్, బడాబజార్ క్రాస్‌రోడ్ పరిసర ప్రాంతాలు.

ప్రత్యంగిరా దేవికి ప్రత్యేక పూజలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠంలోని ప్రత్యంగిరా దేవి ఆలయంలోని అమ్మవారిని సినీ నేపథ్య గాయకులు రమ్య బెహరా, సాహితీ, సాయిచరణ్, హరిణి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గాయకురాలు రమ్య బెహరా మాట్లాడుతూ, ప్రత్యంగిరా దేవి చాలా మహిమ గల దేవతని, కుర్తాళం పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి స్వామి నడిచే దైవమని, మహామంత్రస్వరూపులని అన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విట్టల్ శర్మ,సాయి కుమార్ శర్మ, శ్రీమతి అరుణ,హేమంత్, గోపాలకృష్ణ, రామశర్మ, శ్రీపతి పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

సాక్షి, సిటీబ్యూరో: రాధాస్వామి సత్సంగ్ (దయాల్‌బాగ్) మలక్‌పేట బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 30న ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మన్సూరాబాద్ రోడ్డులోని అగమ్‌నగర్ కాలనీలో ఈ శిబిరం ఉంటుందన్నారు. శిబిరంలో రోగులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యసలహాలు, మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వివరాలకు 9491526684 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉచిత కాలేయ పరీక్ష శిబిరానికి విశేష స్పందన



పరీక్ష చేయించుకునేందుకు వచ్చిన జనం

మన్సూరాబాద్: ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కాలేయ పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. హెపటైటీస్–బీ, బీపీ, ఓఆర్‌ఎస్, ఫైబ్రోస్కాన్ పరీక్షలతో పాటు సీనియర్ హెపటాలజిస్ట్ కన్సల్టేషన్ ఉచితంగా అందించారు. సుమారు 700 మంది వైద్యశిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారని హాస్పిటల్స్ సీనియర్ హెపటాలజిస్ట్ డాక్టర్ కావ్య దేన్నుకూరి తెలిపారు.

ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌ఓటీ 2 అదనపు డీసీపీగా ప్రసాద్‌రావు



నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌ఓటీ 2 అదనపు డీసీపీగా జి.ప్రసాద్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

చలమా రెడ్డి మృతి తీరని లోటు: పీడీఎస్‌యూ

నాగోలు: తెలంగాణ ఉద్యమకారుడు వెదిరే చలమారెడ్డి మృతి తీరని లోటు అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురాం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపేట విక్టోరియా మెమోరియల్ స్కూల్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు ఇవ్వడాన్ని నిరసిస్తూ వీఎం హోమ్ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో చలమారెడ్డి తనతో కలిసి పని చేశారని పరశురాం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. చలమారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

తగ్గని వరద...తొలగని కష్టాలు

- రోడ్లపై ఇంకా పారుతున్న నీరు
- రాకపోకలకు అవస్థలు
- వర్షపు నీటితో నిండు కుండలా సరూర్‌నగర్ చెరువు
- నాలా పూడిక తీత సరిగ్గా లేకే ఇబ్బందులు



వర్షం నీటితో నిండుకుండలా మారిన సరూర్‌నగర్ చెరువు

చైతన్యపురి: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు శుక్రవారం తగ్గుముఖం పట్టినా రహదారులపై వరద నీరు మాత్రం ఇంకా తగ్గలేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సరూర్‌నగర్ చెరువులోకి భారీగా నీరు చేరడంతో చెరువు ఔట్‌లెట్ నుంచి వచ్చే వరద నీరు కాలనీల్లోని రహదారులపై పారుతోంది. దీంతో గడ్డిఅన్నారం డివిజన్‌లోని వీవీనగర్, కోదండరాంనగర్ కాలనీల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఎగువనున్న కాలనీల నుంచి వరదనీరు భారీగా చేరడంతో సరూర్‌నగర్ చెరువు నిండు కుండలా మారింది. వాన తగ్గినప్పటికీ రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు కష్టంగా మారింది. రహదారికి లోతట్టు ఉన్న కొన్ని ఇళ్లలోకి కూడా వరదనీరు చేరింది.

చెత్తను తొలగిస్తే ఈ ఇబ్బందులుండేవి కాదు...

చెరువు ఔట్‌లెట్ వద్ద ఎటువంటి జాలీ లేకపోవటం వల్ల నాలాల్లోకి చెత్త చేరి వరదనీరు సాఫీగా ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఫలితంగా డ్రైనేజీలు పొంగి కాలనీలను ముంచెత్తుతున్నాయని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు.



వీవీనగర్ కాలనీలో రోడ్డుపై పారుతున్న వరద



కోదండరాంనగర్ కాలనీలో ఇదీ పరిస్థితి

- వర్షాకాలం వచ్చే ముందే నాలా పూడిక తీత పనులు చేసి ఉంటే ఇలాంటి ఇబ్బందులు కలిగేవి కావంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందంటున్నారు. ఎప్పుడు వర్షం పడినా కంటిమీద కునుకులేకుండా ఆందోళన చెందాల్సి వస్తుందంటున్నారు.

జాలీ కోసం ఏడాదిగా విజ్ఞప్తి చేస్తున్నాం..



డివిజన్‌లోని కాలనీలు, బస్తీలు వరద ముంపు బారిన పడకుండా ఉండాలంటే నాలాల్లో చెత్త చేరకుండా చర్యలు తీసుకోవాలని ఏడాది కాలంగా జీహెచ్‌ఎంజీ జోనల్ కమిషనర్, అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నాం. ఔట్‌లెట్ వద్ద జాలీ ఏర్పాటు చేయాలని కోరాం. అయినా పట్టించుకోలేదు. ఫలితంగా కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక నాలా పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టకపోవటం వల్ల కూడా ఇబ్బందులు వస్తున్నాయి. వరదలు వచ్చే సమయంలో నాలాలోని చెత్త తీసేందుకు ఎటువంటి వ్యవస్థ అందుబాటులో లేదు. నాలుగు రోజులుగా మ్యాన్‌హోళ్ల వద్ద నాలాల్లోని చెత్త తొలగిస్తుండటంతో కొంత మేలు జరిగింది. ఇప్పటికైనా చెరువు ఔట్‌లెట్ వద్ద జాలీ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి.

–బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్, గడ్డిఅన్నారం డివిజన్



చెరువు ఔట్‌లెట్ నుంచి నాలాల్లోకి చేరుతున్న వరద

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



సైబర్ నేరాలపై చిరువ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లోని ఎల్‌పీటీ మార్కెట్ ఎదుట ఎస్‌ఐ రవికుమార్ సైబర్ నేరాలపై చిరువ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా జనాన్ని ఆకర్షిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ మొబైల్ నెంబర్‌కు లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని, మేము పంపిన లింక్‌ను క్లిక్ చేస్తే మీ అకౌంట్‌లోకి డబ్బులు వస్తాయని ఫోన్ చేసి కొందరు మాయమాటలు చెప్పి బ్యాంక్ అకౌంట్లలోని డబ్బును దండుకుంటున్నారని తెలిపారు. మీ మొబైల్ నెట్‌వర్క్స్, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు మీ ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పమని అడగరని, ఎవరైన అలా అడిగితే ఓటీపీలు చెప్పకుండా జాగ్రత్తగా ఉండి పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుర్వేద వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి

సైదాబాద్: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సైదాబాద్‌లోని రెవెన్యూ బోర్డ్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానాలు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేస్తాయన్నారు. సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు ఆంటోని, లోకసాయి కిరీటి, హేమరాజు, భార్గవి, లైబ్రేరియన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'విశ్వనగరంగా కాదు..విషాద నగరంగా మార్చారు'

ఎల్‌బీనగర్: నగరాన్ని విశ్వనగరంగా కాదు.. విషాద నగరంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్చిందని ఎల్‌బీ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆరోపించారు. కొద్దిపాటి వర్షాలకే హైదరాబాద్ అతలాకుతలం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొంటూ శుక్రవారం రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 శాతం కమీషన్‌కు ఆశపడి అవగాహన లేకుండా పనులు చేపట్టి మధ్యలోనే ఆపేశారని, దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం వెంటనే రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు జి. శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, నరసింహయాదవ్, కిషోర్‌గౌడ్, మంజులారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గాం.దీనాయక్, రమేష్, జైపాల్‌రెడ్డి, చందులాల్, షరీఫ్, కరీం, సుజాతారెడ్డి, కల్పనారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిందేమీ లేదు: జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి, టీపీసీసీ డెలిగేట్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఎల్‌బీనగర్ నుంచి భారీ స్థాయిలో జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని డల్లాస్, సింగపూర్‌లా మారుస్తానని సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో చేసింది శూన్యమని, చిన్నపాటి వర్షానికే కాలనీలు జలమయమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు బుడ్డ సత్యనారాయణ, సతీష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, స్వామి పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు



జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

ముంపు సమస్య నివారణకు చర్యలు: ఎమ్మెల్యే



హైకోర్టు కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీ, జగదాంబ కాలనీల వరద ముంపు సమస్య నివారణకు అతి త్వరలో బీడీఎల్ కాలనీ వద్ద నూతన ఔట్‌లెట్‌ను నిర్మిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆయా కాలనీల్లో పర్యటించారు. ద్వారకామయినగర్, చుట్టుపక్కల కాలనీల నుంచి వస్తున్న వరద నీరు తమ కాలనీలకు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హైకోర్టు కాలనీ, బీడీఎల్, జగదాంబ కాలనీలవాసులు తెలిపారు. ఒక ఔట్‌లెట్ నిర్మిస్తే తమ ఇబ్బందులు తొలగిపోతాయని ఎమ్మెల్యేకు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, తూర్పు కాలనీల జేఏసీ అధ్యక్షుడు శ్రావణ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, జగన్‌మోహన్, సుధీర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అవినాష్, శ్రీనివాస్, సునీల్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేయాలి



డీసీ రవీందర్ కుమార్‌ను సత్కరించిన కార్పొరేటర్ అరుణ-సురేంద్రనాథ్

నాగోలు: డివిజన్ పరిధిలో స్థలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ–సురేంద్రనాథ్ యాదవ్ జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ కుమార్‌ను కోరారు. జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ రవీందర్ కుమార్‌ను కార్పొరేటర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసిన అభినందిచారు. అనంతరం డివిజన్‌లోని సమస్యలపై చర్చించారు.

జీఎస్‌ఐ ఏడీజీగా వెంకటేశ్వర్‌రావుకు పదోన్నతి



వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో డీడీజీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్‌రావు జీఎస్ఐ ఏడీజీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆదర్ల మహేష్, మధిర సత్యనారాయణల ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసరావు, మేఘరాజ్, కిషోర్‌కుమార్, లింగయ్య, మల్లేష్, చంద్రయ్య, చక్రేశ్వర్, శివశంకర్, అనిల్‌కుమార్, యాదగిరి, నరేందర్, దయానంద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానా

మీర్‌పేట: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్ హెచ్చరించారు. శుక్రవారం కమిషనర్ వాణితో కలిసి ఆర్‌సీఐ రహదారిని మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రహదారి పక్కన ఉన్న చెత్తను సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సూచిక బోర్డులను ప్రదర్శించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందం ఇన్‌చార్జి నర్సింహ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆటోవాలా అరెస్టు

నాగోలు: ఆటోను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఆర్టీసీ డ్రైవర్‌తో గొడవ పడి చెప్పుతో దాడి చేసిన ఆటోవాలాను నాగోలు పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోలు డివిజన్ జైపురికాలనీలో నివాసం ఉండే తిరుపతి అర్జున్ ఆటో డ్రైవర్. శుక్రవారం ఉదయం ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ బండ్లగూడ వెళ్లడానికి బస్సును నాగోలు చౌరస్తాలో యూటర్న్ చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ అర్జున్ తన ఆటోను రోడ్డుకు అడ్డంగా పెట్టి బస్సును ముందుకు పోనివ్వలేదు. దీనిపై నిలదీసిన బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌తో ఆటో డ్రైవర్ గొడవ పడి చెప్పుతో దాడి చేశాడు. రక్త గాయం కావడంతో ఆర్టీసీ డ్రైవర్ నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో డ్రైవర్ తిరుపతి అర్జున్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 83, వంకాయ 35, బెండ 45, పచ్చిమిర్చి 75, కాకర 52, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 45. దొండ 18, ఆలు 21, ఉల్లి 19, గోకర 28, దోస 21, సొర 15, పొట్ల 13, అరటి 11, చిక్కుడు 65, అర్వి 43, మునగ 28, చిలగడదుంప 45, బీట్‌రూట్ 15, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 80, కాప్సికమ్ 75. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయలు

నాగోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి గ్రామానికి చెందిన బడగోని అశోక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగం నిమిత్తం నగరానికి ఎల్‌బీనగర్ ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్న శరత్‌రెడ్డి గదికి మూడు రోజుల క్రితం వచ్చి ఉంటున్నాడు. గురువారం రాత్రి అశోక్ తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై టీకేఆర్ కమాన్ నుంచి సాగర్ రింగ్ రోడ్ ఫ్లైఓవర్ మీదుగా ఎస్‌బీఐ కాలనీకి బయలుదేరాడు. మార్గం మధ్యలో శ్రీకర హాస్పిటల్ వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్, ప్రవీణ్ తలకు, ఇతర శరీరా భాగాలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. శరత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థికి 'రుచిత ట్రస్ట్' ఆర్థిక సాయం

నాగోలు: పేదలకు చేయూత అందించడంలో రుచిత చారిటబుల్ ట్రస్ట్ ముందు ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ తోడుపునూరి సతీష్ అన్నారు. రోహన్ అనే పేద విద్యార్థి చదువు కోసం రుచిత చారిటబుల్ ట్రస్ట్ రూ.35,500 వేల ఆర్థిక సాయం చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును ట్రస్ట్ చైర్మన్ సతీష్ విద్యార్థి తల్లికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోహన్ చదువు కోసం మానవతా దృక్పథంతో గతేడాది కూడా ఆర్థిక సాయం చేశామని, అదే స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరం కూడా చేశామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా అనేక మంది పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నామని ఆయన తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ సతీష్

'ప్రతి పేద కుటుంబానికి రూ.10 వేలు ఇవ్వాలి'



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: భారీ వర్షాల వల్ల రామకృష్ణాపురం, సరూర్‌నగర్ డివిజన్లలో వరద ముంపునకు గురైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేయాలని మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. వాన బాధితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమానికి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఆర్‌కేపురం, సరూర్ నగర్ డివిజన్ల పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, చిక్కుళ్ల శివ ప్రసాద్, ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూధన్ రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు నల్లంకి ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని బస్తీలు, మురికివాడల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ ఐఎస్ సదన్‌లోని పలు మురికివాడలు, బస్తీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. పెన్షన్ల సకాలంలో అందడంలేదని, పలు పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నాలా అసంపూర్తి పనుల వల్లే ఇబ్బందులు: సామ



వీవీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న నాలా పనులను పరిశీలిస్తున్న సామ రంగారెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: నాలాల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి డివిజన్‌లోని వీవీనగర్ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. వరద ముంపునకు గురైన ప్రాంతంలోని వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వీవీనగర్ కాలనీలో జరుగుతున్న నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, నాలా పనులు అసంపూర్తిగా మిగిలి పోవటం వల్లే వరద ముంపు సమస్య వస్తోందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి డ్రైనేజీ, వరద సమస్య నుంచి గడ్డిఅన్నారం డివిజన్ ప్రజలను గట్టెక్కించే మార్గంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, నాయకులు రాజేశ్వరి, షేక్ ఉమర్, వెంకటరెడ్డి, ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం..

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రంగారెడ్డి అర్బన్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ ఫేజ్–2లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి రంగారెడ్డి పర్యటించి సగంలో ఆగిపోయిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఎరుకల మల్లేశ్‌గౌడ్, రాజుగౌడ్, మల్లేశ్ యాదవ్, కాలనీవాసులు వెంకటేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, బాలాజీ, శేఖర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, నవనీత్‌గురు పాల్గొన్నారు.